# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేల్చుదాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM


శుక్రవారం / 09.02.2024


## అయోధ్య రామయ్య సేవలో అమితాబ్



**తెలంగాణవీణ, జాతీయం :** బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ రెండోసారి అయోధ్యను సందర్శించారు . ఇటీవల బాలరామయ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన శుక్రవారం మళ్లీ శ్రీరాముడిని దర్శించుకున్నారు. ఓ నగల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అయోధ్య వెళ్లిన ఆయన బాలరామయ్య సేవలో పాలొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బిగ్ బి రాక సందర్భంగా మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం, అయోధ్య ధామ్ మరియు పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ నేపథ్యంలో భారీ భద్రత మధ్య బిగ్‌బీ ఆలయం నుంచి బయటకు వస్తున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది.

# మన పీవీకి అతి గొప్ప నివాళి




**తెలంగాణవీణ, జాతీయం :** పాములపర్తి వెంకట నరసింహరావు మాజీ ప్రధానిగా మాత్రమే తెలుసు. ఆయన జీవితంలో ప్రతి పేజీ నేటి తరానికి ఒక పాఠం. ఆయనలో ఎన్ని కోణాలు. ఎన్ని పార్శ్వాలు.. ఎందుకంటే ఒకటి కాదు రెండు కాదు పదిహేడు భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన వ్యక్తి. ఎంత కృషి చేస్తే ఇలాంటిది సాధ్యమవుతుంది. ఒక వ్యక్తి ఇలా ఎదగడం సాధ్యమా?అన్న అనుమానాలకు పీవీ పేరు చెబితే అది తొలగిపోతుంది. ఎక్కడో మారు మూల గ్రామంలో జన్మించి దేశాన్ని ఏలడం.. అదీ దక్షిణాది రాష్ట్రానికి చెందిన ఒక నేత దేశరాజకీయాలను శాసించడం అంటే మాటలు కాదు. ఆషామాషీ కాదు. అలాంటి పీవీ నరసింహారావుకు నేడు భారతరత్న ప్రకటించడం నిజంగా ముదావహం.

**కుగ్రామంలో జన్మించి...**

పీవీ నరసింహారావు 1921 జూన్ 28వ తేదీన జన్మించారు. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లిలో ఆయన రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు జన్మించారు. ఆ తరవాత వంగర గ్రామంలో ఉన్న తమ బంధువుల ఇంటికి దత్తతకు వెళ్లారు. అప్పుడే ఆయన ఇంటి పేరు మారింది. ప్రాథమిక విద్య వరంగల్ జిల్లాలో ప్రారంభించిన పీవీ న్యాయశాస్త్రంలో పట్టా అందుకున్నారు. తర్వాత స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న పీవీ నరసిహారావు ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 1951లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరణించే వరకూ అదే పార్టీలో కొనసాగారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన అనేక బాధ్యతలను నిర్వహించారు.

**ఆర్థిక సంస్కరణలతో...**

రాజీవ్ గాంధీ మరణించిన తర్వాత ఆయన అనూహ్యంగా ప్రధాని అయ్యారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వ్యక్తి ఎక్కువ కాలం ప్రధానిగా పనిచేసింది పీవీ మాత్రమే. 1991 నుంచి 1996 వరకూ ఆయన భారత ప్రధానిగా పనిచేశారు. ఈ సమయంలోనే ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. ఆర్థిక సంస్కరణలను అమలులోకి తెచ్చారు. అప్పటి వరకూ కూలిపోయే దశలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు పీవీ తన మేధస్సుతో ఊతమిచ్చి దేశం ఆర్థికంగా పతనం కాకుండా ఆయన చేసిన కృషి ఎవరూ మరువలేరు. కుల ప్రాబల్యం లేని, ప్రాంతం కలసిరాని చోటు నుంచి వచ్చిన పీవీ తన మేధస్సుతోనే అందలం ఎక్కారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే ఎవరి ఊహలకు కూడా అందని పదవిని ఆయన అందుకున్నారు. అందివచ్చిన అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకున్నది కూడా మన పీవీ మాత్రమే. మన్మోహన్ సింగ్ ను ఆర్థికమంత్రిని చేసి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన ఘనత కూడా ఆయనదే.

**అంతర్జాతీయంగా కూడా...**

ఇక కేవలం దేశ రాజకీయాలు మాత్రమే కాదు. అంతర్జాతీయంగా ఆయన తీసుకున్న నిర్ణయాలు కూడా నాడు ప్రముఖుల ప్రశంసలు పొందాయి. కాశ్మీర్ తీవ్రవాదరులు ప్రముఖులను కిడ్నాప్ చేసినప్పుడు వారి డిమాండ్లకు ఏమాత్రం లొంగకుండా వారిని విడిపించింది కూడా మన పీవీనే. అలాంటి లౌక్యుడు. ఇజ్రాయిల్ ధౌత్య సంబంధాలతో పాటు తీవ్రవాదానికి పాకిస్థాన్ ఇస్తున్న బయటపెట్టి ప్రపంచదేశాల్లో చర్చకు పెట్టడంతో పాటు ఆగ్నేసియాదేశాలతో సంబంధాలను మెరుగుపర్చుకోవడం కూడా అంతర్జాతీయంగా ఆయనకున్న దృష్టి కోణానికి ఒక నిదర్శనం. ఆయన హయాంలోనే భారత్ కు చైనా, ఇరాన్ దేశాలతో సత్సంబంధాలు మెరుగుపడ్డాయి. అలా పీవీ దేశాన్ని అంతర్జాతీయ చిత్ర పటంలో కూడా నిలిపారంటే ఆయనకు ఏమిచ్చి మనం రుణం తీర్చుకోవాలి? అన్న కామెంట్స్ చేసిన రాజకీయ నేతలు కూడా ఉన్నారు.

**సాహిత్యరంగంలోనూ...**

అయితే అదే సమయంలో బాబ్రీ మసీదుకూల్చివేత ఘటన, జేఎంఎం ముడుపుల కేసు వంటి ఆరోపణలు వినిపించినప్పటికీ అరుదైన మహా నేత పీవీ అని కొనియాడని వారుండరు. ఆయనను సొంత పార్టీ నేతలే కాదు ఆయన ఆలోచనలకు, వ్యూహాలకు ప్రత్యర్థులు కూడా ప్రశంసించిన రోజులున్నాయి. పీవీ నరసింహారావు కేవలం రాజకీయ రంగంలోనే కాదు. సాహిత్యరంగంలోనూ పేరుంది. ఆయన ఆ వయసులో కంప్యూటర్ ను ఉపయోగించడంలోనూ, అందులో మెళుకువలను నేర్చుకోవడంలో ఆయనకున్న జిజ్ఞాసకు ఒక ఉదాహరణ. ఆయన సాహిత్యరంగంలో చేసిన కృషికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆయన రచించిన ఇన్‌సైడర్ అనేక భాషల్లో అనువదించారు. పదిహేడు భాషల్లో ప్రవేశం ఉన్న పీవీకి కాంగ్రెస్ పార్టీ హయాంలో కాకపోయినా బీజేపీ పాలనలో ఆయకు అత్యున్నత పురస్కారం భారతరత్న లభించడం నిజంగా తెలుగు వారి అదృష్టమే. ఒక తెలుగు వారికి అరుదైన పురస్కారం దక్కడం నిజంగా సంతోషించ దగ్గ విషయమే. ఆయన 2004 డిసెంబరు 23న మరణించారు.

## సోనాక్షి సిన్హా పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ

**తెలంగాణవీణ,సినిమా :** తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఇప్పుడు చిక్కుల్లో పడింది. ఏకంగా నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది కోర్టు. ఆమె ఎవరో కాదు బాలీవుడ్ లో తనకంటూ మంచి క్రేజ్ సొంతం చేసుకున్న నటి సోనాక్షి సిన్హా. ఈ అమ్మడు ఇప్పుడు అనుకోని చిక్కుల్లో పడింది. మోసం చేశారన్న ఆరోపణల కేసులో సోనాక్షి సిన్హా టీమ్ ఆరుగురు సభ్యులపై, ఆమె మేనేజర్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది కోర్టు. అంతే కాదు అరెస్టు చేసే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.2018లో, నటి సోనాక్షి సిన్హా ఒక పబ్లిక్ ఈవెంట్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోనాక్షి సిన్హా రెమ్యునరేషన్ అందుకుంది. . కానీ ఆ ప్రోగ్రాంకు ఆమె హాజరు కాలేదు. దీంతో ఈవెంట్ నిర్వాహకులకు భారీ నష్టం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడమే కాకుండా.. సోనాక్షి సిన్హా ఇచ్చిన డబ్బును కూడా తిరిగి ఇవ్వలేదు. దీంతో కార్యక్రమ నిర్వాహకులు కోర్టులో మోసం కేసు వేశారు. ట్రయల్ కోర్టు సోనాక్షి మేనేజర్లు అలాగే ఆమె టీమ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.



## నేటి నుంచి నాగోబా మహా జాతర



**తెలంగాణవీణ,ఆదిలాబాద్ :** తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ఆదివాసీల ఉత్సవమైన నాగోబా జాతర నేటి నుంచి అత్యంత వైభవంగా సాగనుంది. మేడారం తర్వాత అంతటి పేరుగాంచిన జాతర ఇది. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర సర్కారు ఎంతో ఘనంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ రోజు అర్ధరాత్రి మహాపూజతో జాతర ప్రారంభంకానుండగా.. మూడు రోజులపాటు ప్రత్యేక పూజల అనంతరం జాతర ముగియనుంది. ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నాగోబా జాతర నేడు ప్రారంభం కానుంది. మెస్రం వంశీయులు ఇప్పటికే 220 కిలో మీటర్లు దూరం కాలినడక వెళ్లి పవిత్ర గోదావరి జలాన్నితీసుకొచ్చారు. ఆ జలంతో ఇవాళ అర్ధరాత్రి నాగోబాకు పూజ చేయడంతో జాతరకు అంకురార్పణ జరుగుతుంది. ఈ నెల 15 వరుకు కొనసాగే ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్, ఒడిశా,కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్, ఏపీ నుంచి భక్తులు తరలివస్తారు. పుష్యమాస అమవాస్యను పురస్కరించుకుని నేటి రాత్రి 10.30 గంటలకు పవిత్ర గంగాజలంతో నాగోబాకు అభిషేకం చేస్తారు మెస్రం వంశీయులు..అనంతరం మహాపూజతో అర్ధరాత్రి 12 గంటలకు నాగోబా తొలిదర్శనం ఇవ్వనుంది..ఈ నెల12న గిరిజన మహా దర్బార్ నిర్వహిస్తారు.

## షర్మిలపై మంత్రి రోజా ఫైర్



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఏపీ పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కాంగ్రెస్, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. షర్మిల రాక ముందు వరకూ స్తబ్దుగా ఉన్న హస్తం పార్టీ నేతలు.. వైఎస్ షర్మిల ఎంట్రీతో యాక్టివ్ అయ్యారు. అటు వైఎస్ షర్మిల సైతం జగనన్న అంటూనే.. సోదరుడిపై విమర్శల తూటాలు పేలుస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలు, మంత్రుల నుంచి వైఎస్ షర్మిలకు కౌంటర్లు వస్తున్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి రోజా చీఫ్ వైఎస్ షర్మిలపై తీవ్ర విమర్శలు చేశారు. విశాఖలో ఆడుదాం ఆంధ్ర ఫైనల్స్‌ను మంత్రి రోజా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోనే చంద్రబాబు, షర్మిల తీరుపై రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో మాదిరిగానే టీడీపీతో పాటు ఆ పార్టీతో కలిసి వచ్చే పార్టీలతో ఏపీ ఓటర్లు ఆడుకుంటారని రోజా సెటైర్లు పేల్చారు. ఓడించి హైదరాబాద్ తరిలిమేస్తారని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో సీఎం ఫోటోలపై విపక్షాలు చేస్తున్న విమర్శలకు తీవ్రస్థాయిలో బదులిచ్చారు రోజా.

## పార్లమెంట్‌లో ప్రధాని మోడీతో జగన్ భేటీ



**తెలంగాణ వీణ, ఏపీ బ్యూరో :** ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. శుక్రవారం పార్లమెంట్‌లో ప్రధాని మోడీతో జగన్ భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా విభజన హామీల అమలు సహా రాజకీయ అంశాలు ప్రధానితో జగన్ చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇంకా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల, పోలవరం నిధులు త్వరితగతిన విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తి నిర్మాణ వ్యయంకు ఆమోదం, 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి బకాయిల క్లియరెన్స్, కేంద్ర వాటా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన పన్ను చెల్లింపులు చేయాలని జగన్ ప్రధాని మోదీని కోరనున్నట్లు సమాచారం.అలాగే జాతీయ ఆహార భద్రతాచట్టం ఆంధ్రప్రదేశ్‌కు మరింత ఎక్కువ కవరేజీ కింద ఏపీ కన్నా ఆర్థికంగా ముందువరుసలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు సమానంగా వాటా.. ఈ వాటా లభిస్తే.. రాష్ట్రంలో 56 లక్షల కుటుంబాలకు కేంద్రం రేషన్ దక్కే అవకాశం ఉందని, కొత్త జిల్లాల్లో ఏర్పాటవుతున్న మెడికల్ కాలేజీలకు కేంద్రం వాటాగా మరింత సాయం చేయాలని జగన్ కోరనున్నారు. ఏపీఎండీసీ కింద ఏర్పాటయ్యే ప్లాంట్లకు ముడి ఖనిజం ఇచ్చేలా కేంద్ర గనుల శాఖకు ఆదేశాలు ఇవ్వాలని, ఏపీ పౌరసరఫరాల శాఖకు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న సబ్సిడీ బకాయిల క్లియరెన్స్ తదితర అంశాలను జగన్మోహన్ రెడ్డి ప్రధాని దృష్టికి తీసుకెళ్లనున్నారు.

## ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. ఇవాళ్టి సమావేశాల్లో భాగంగా ఉభయ సభల్లో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టి చర్చిస్తున్నారు. రెండో రోజు సమావేశాల్లో శాసనసభలో ఆటో డ్రైవర్ల సమస్యపై వాడివేడిగా చర్చ జరుగుతోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడాన్ని ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ సమర్థిస్తూనే, దానివల్ల ఆటో డ్రైవర్లకు నష్టం కలుగుతోందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. రాష్ట్ర సర్కార్ ఆటో కార్మికుల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆరోపించింది.ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అన్ని వర్గాల వారి సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం తమ బాధ్యత అని చెప్పారు.



వారికి ఏటా రూ.12 వేలు సాయం చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. బడ్జెట్‌లో వారి కోసం ప్రత్యేకంగా కేటాయింపులు జరుపుతామని వెల్లడించారు.

## 'వైట్ పేపర్ కాదు..బ్లాక్ బార్స్'.. పార్లమెంట్‌లో బీజేపీ కాంగ్రెస్ పోటాపోటీ



**తెలంగాణ వీణ , జాతీయం :** ఢిల్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు వాడి వేడిగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్వేతపత్రంపై లోక్‌సభలో అధికార, విపక్ష పార్టీల మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది. నాలుగు గంటలపాటు కొనసాగిన చర్చలో యూపీఏ హయాంలో ఆర్థిక వ్యవస్థ దివాలతీసిన వైనంపై అంకెలతో సహా వివరించారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. ఆ తర్వాత విపక్ష కాంగ్రెస్ ఎంపీ మనీష్‌తివారీ.. నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలను ఖండించారు.2004లో యూపీఏ సర్కార్ అధికారంలోకి వచ్చే సమయానికి భారత ఆర్థిక వ్యవస్థ 8 శాతం వృద్ధిరేటుతో ఉందన్నారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. అలాంటిది కాంగ్రెస్ పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని విమర్శించారామె. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా కాంగ్రెస్ సర్కార్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని మండిపడ్డారు. 2014లో ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే అయిదో స్థానానికి తీసుకొచ్చిందని చెప్పారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. లోక్‌సభలో వైట్ పేపర్‌పై నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై కౌంటరిచ్చారు కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ. ఇది వైట్ పేపర్ కాదు..బ్లాక్ బార్స్ అని విమర్శించారు. లోక్ సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ కాంగ్రెస్ గతంలో చేసిన తప్పులను ఎత్తి చూపేందుకు బీజేపీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగానే శ్వేతపత్రం అంశాన్ని తెరపైకి తెచ్చింది. అయితే దీనిని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

## 69వ ఫిలింఫేర్‌లో 5 అవార్డులు సొంతం చేసుకున్న మూవీ 12th ఫెయిల్




**తెలంగాణవీణ,సినిమా :** చిన్న సినిమాగా వచ్చి సంచలన విజయం సాధించిన సినిమా 12th ఫెయిల్. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు రాబట్టింది. విక్రాంత్ మాస్సే ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోనూ దూసుకుపోతుంది. ఈ చిత్రం 27 అక్టోబర్ 2023న విడుదలైంది. విక్రాంత్ మాస్సే, మేధా శంకర్ ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించారు. అంతే కాకుండా ఈ చిత్రం ద్వారా మేధా శంకర్ కూడా ఓవర్ నైట్ స్టార్ అయిపోయారు. ముఖ్యంగా ఈ సినిమా ఓటీటీలో వచ్చిన తర్వాత జనాల్లో మరింత ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమా విడుదలై 100 రోజులు పూర్తి చేసుకుంది. ఇటీవలే ఈ సినిమా 69వ 'ఫిలిం ఫేర్' అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఏకంగా ఈ సినిమా 69వ ఫిలిం ఫేర్‌లో 5 అవార్డులు సొంతం చేసుకుంది.